క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దుబ్బాకరూరల్: మండలంలోని ఆరెపల్లి, పోతారం, అచ్చుమాయిపల్లి, కమ్మర్‌పల్లి, గంభీర్‌పూర్, శిలాజీనగర్, వెంకటగిరితండా, పెద్ద చీకోడ్, లచ్చపేట, రామక్కపేట గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రామాంజనేయులు తెలిపారు. విద్యుత్ తీగలకు ఆనుకొని ఉన్న చెట్ల కొమ్మలు నరికి వేస్తున్నందున ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటను వరకు విద్యుత్ ఉండదని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఐకమత్యంతోనే ఆర్థికాభివృద్ధి

కోహెడ(హుస్నాబాద్): కోహెడలో ఏర్పాటు చేసిన చపాతి తయారీ కేంద్రాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీఓ పీడీ జయదేవ్ అన్నారు. పీఎంఎఫ్‌ఎంఈ పథకం ద్వారా మహిళా గ్రూపునకు మంజూరైన చపాతి తయారీ కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. యూనిట్‌కు రూ.3 లక్షల 62 వేలు మంజూరైనట్లు చెప్పారు. ప్రభుత్వం నుంచి 35 శాతం సబ్సిడీ లభిస్తుందన్నారు. నిర్వాహకులు ఐక్యమత్యంతో కేంద్రాన్ని నిర్వహించి ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఎంలు వాసుదేవ్, విద్యాసాగర్, ఎంపీడీఓ మధుసూదన్, ఏపీఎం తిరుపతి, సీసీలు రమేశ్, సంపత్, హేమలత, స్రవంతి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

చిన్నకోడూరు(సిద్దిపేట): రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలపరిధిలోని రామునిపట్ల వద్ద బుధవారం రాత్రి జరిగింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన కాకర్ల ప్రదీప్ బుధవారం రాత్రి కారులో కరీంనగర్ వెళ్తుండగా.. గుర్తుతెలియని, మతిస్థిమితం లేని వ్యక్తి రామునిపట్ల వద్ద రోడ్డు దాటుతుండగా కారు ఢీకొంది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు సుమారు 25 నుంచి 30 ఏళ్ల వయసు ఉంటాడని, మృతదేహాన్ని సిద్దిపేట మార్చురీకి తరలించినట్లు ఎస్‌ఐ సురేష్‌గౌడ్ తెలిపారు. పంచాయతీ కార్యదర్శి కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

'అమరుల కుటుంబాలకు అన్యాయం'

కొండపాక(గజ్వేల్): అమరుల కుటుంబాలను మోసం చేసిన సీఎం కేసీఆర్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలని తెలంగాణ అమరుల కుటుంబాల రాష్ట్ర అధ్యక్షుడు, గజ్వేల్ అభ్యర్థి మేకల రఘుమారెడ్డి కోరారు. కుకునూరుపల్లి మండల కేంద్రంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. మలిదశ రాష్ట్ర సాధనలో 1,386 మంది యువకులు ఆత్మబలిదానాలు చేసుకున్నారని తెలిపారు. గజ్వేల్ నియోజకవర్గ అసెంబ్లీ స్థానానికి యుగతులసీ పార్టీ తరఫున పోటీ చేస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో అమరవీరుల కుటుంబాల సభ్యులు ధనలక్ష్మి, సరిత, మమత, మోహన్, శంకర్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


ప్రజలను బెదిరించడం సరికాదు



మాట్లాడుతున్న హరికృష్ణ

నంగునూరు(సిద్దిపేట): ఇతర పార్టీ అభ్యర్థుల ప్రచారానికి వెళ్లొద్దని బీఆర్‌ఎస్ నాయకులు ప్రజలను బెదిరింపులకు గురి చేస్తున్నారని సిద్దిపేట కాంగ్రెస్ అభ్యర్థి పూజల హరికృష్ణ ఆరోపించారు. గురువారం మైసంపల్లి, నర్మెట, అప్పలాయిచెర్వు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు శంకర్, దేవులపల్లి యాదగిరి, ఎనగందుల యాదగిరి, కనకయ్య, అశోక్, నాగరాజు, రాములు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బలగాల కవాతు



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని గొల్లపల్లి, కేశవాపూర్, మోత్కులపల్లి, పెద్దతండా, కట్కూర్, చాపగానీ తండా గ్రామాల్లో గురువారం హుస్నాబాద్ సీఐ కిరణ్, ఎస్సై వివేక్, కేంద్ర బలగాలు కవాతు నిర్వహించారు. అందరూ శాంతియుతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

హరీశ్‌రావుకు అండగా నిలుద్దాం



ఏకగ్రీవ తీర్మాన పత్రాన్ని అందజేస్తున్న కాసారంపల్లి గ్రామస్తులు

- సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

సిద్దిపేటజోన్: ఎన్నికల్లో మంత్రి హరీశ్‌రావుకు అండగా నిలవాలని సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల అన్నారు. గురువారం 23, 24 వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సిద్దిపేట ప్రగతి పుస్తకాలు, కరపత్రాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సిద్దిపేట ప్రజలే మంత్రికి బలం అని అన్నారు. ఈసారి అత్యధిక మెజార్టీ ఇవ్వాలని ప్రజలను కోరారు. అంతకుముందు 6వ వార్డులో సిద్దిపేట దొమ్మరి కుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌కు మద్దతు తెలుపుతూ ఏకగ్రీవ తీర్మాన పత్రాలను మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, పట్టణ అధ్యక్షుడు సంపత్‌రెడ్డికి అందించారు. అలాగే 7వ వార్డులో ముస్లిం మైనార్టీలు ఏకగ్రీవ తీర్మానం అందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు విఠోభ, సాయన్న గారి సుందర్, మల్లికార్జున్, వినోద్, అలకుంట మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

గతాన్ని పోల్చి చూడండి

చిన్నకోడూరు(సిద్దిపేట)/నంగునూరు: గత ప్రభుత్వాల పనితీరు, బీఆర్‌ఎస్ ప్రభుత్వ పనితీరును పోల్చిచూడాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణశర్మ అన్నారు. గురువారం మండల పరిధిలోని ఎల్లాయపల్లి, కాసారంపల్లి గ్రామాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి హరీశ్‌రావుకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. కాసారంపల్లి గ్రామస్తులు బీఆర్‌ఎస్‌కు మద్దతుగా ఏకగ్రీవ తీర్మానం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మాణిక్యరెడ్డి, ఉపాధ్యక్షులు పాపయ్య, ఏఎంసీ చైర్మన్ వనిత, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, సర్పంచ్ మహేందర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే నంగునూరు మండలంలోని రాంపూర్, మగ్దుంపూర్ గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు లింగంగౌడ్, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, సోమిరెడ్డి, సారయ్య, మల్లయ్య, మహిపాల్‌రెడ్డి, పర్శరాములు, ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల తదితరులు

అవినీతి తప్ప.. అభివృద్ధి శూన్యం



వల్లంపట్లలో వృద్ధులను ఓటు అభ్యర్థిస్తున్న కొమ్మూరి



కూటిగల్‌లో కురుమ కులస్తులు బహూకరించిన గొర్రెపిల్లతో కొమ్మూరి

- ప్రజలను మోసం చేసిన బీఆర్‌ఎస్
- కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలు
- పార్టీ జనగామ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అవినీతి తప్ప.. రాష్ట్రం ఏ రంగంలోనూ అభివృద్ధి సాధించలేదని కాంగ్రెస్ జనగామ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం దూళ్మిట్ట మండలంలోని రెడ్యానాయక్‌తండా, కూటిగల్, మద్దూరు మండలంలోని వల్లంపట్లలో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న తెలంగాణలో కల్వకుంట్ల కుటుంబ సభ్యులు మాత్రమే పదవులు అనుభవిస్తున్నారని మండిపడ్డారు. తన హయాంలోనే ఈప్రాంతానికి 86 వేల ఎకరాలకు గోదావరి నీటిని అందించామన్నారు. కాల్వల నిర్మాణ పనులు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇప్పటివరకు పూర్తి చేయలేదన్నారు. కేసీఆర్ ఉద్యమకారులను విస్మరించి ఉద్యమద్రోహులను తన వెంట ఉంచుకున్నారని విమర్శించారు. స్థానికేతరుడైన ముత్తిరెడ్డి నియోజకవర్గాన్ని దోచుకున్నాడన్నారు. 8 ఏళ్లు ఎమ్మెల్సీగా ఉన్న పల్లా ఈప్రాంతానికి ఎలాంటి నిధులు కేటాయించలేదన్నారు. అలాంటి వ్యక్తి మాటలు నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. తపాస్‌పల్లి నుంచి సిద్దిపేటకు నీటిని దొంగతనంగా తీసుకెళ్తున్నారని.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నీరు వెళ్లకుండా అడ్డుకుంటామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామన్నారు. దూళ్మిట్ట మండలంలో ఏ గ్రామంలో ఎక్కువగా ఓట్లు వస్తాయో ఆ గ్రామానికి మొదటి నెల జీతంతో పాటు ఎక్కువ నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అంతకు ముందు కూటిగల్‌లో సమ్మక్క–సారలమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు బండి శ్రీనివాస్‌గౌడ్, యూత్ అధ్యక్షుడు చెట్కూరి కమలాకర్ యాదవ్, సర్పంచ్ కూకట్ల బాలరాజు యాదవ్, మాజీ పీఏసీఎస్ వైస్ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మేక మల్లేశం, శ్రీధర్‌రెడ్డి, రాములు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం

జనగామ: పట్టణంలోని 24వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి గెలుపునకు నెహ్రూ పార్క్, కుర్మవాడ, శివాలయం ఏరియా, పోలీస్ స్టేషన్ ప్రాంతాల్లో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గంగరబోయిన మల్లేశం, జాయ మల్లేశం, బూడిద చిన్నాగౌడ్ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. 5వార్డు బాణాపురంలో మహిళా కాంగ్రెస్ అధ్వర్యంలో ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరిస్తూ బడికె



జనగామలో ఇంటింటా ప్రచారం చేస్తున్న దివ్య

ఇందిర, కామిని జయ, సక్కుబాయి, సుజాత తదితరులతో కలిసి కొమ్మూరి కోడలు దివ్యారెడ్డి ప్రచారం చేపట్టారు.

కాంగ్రెస్ హయాంలోనే రాష్ట్రాభివృద్ధి

బచ్చన్నపేట: కాంగ్రెస్ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి చెందిందని, బీఆర్‌ఎస్ హయాంలో చేసిన అభివృద్ధి శూన్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు వంచ వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్లగొని బాలకిషన్‌గౌడ్, మహాత్మాచారి, శ్రీనివాస్, అయిలయ్య, బాలమణి, వేణువందన, రమేష్ పాల్గొన్నారు.

పోలింగ్‌స్టేషన్లలో వసతుల కల్పన



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

దుబ్బాక: ఈనెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్‌స్టేషన్‌లో వసతుల కల్పనకు పంచాయతీ కార్యదర్శులు అన్ని ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్, దుబ్బాక ఎన్నికల అధికారి గరిమా అగర్వాల్ సూచించారు. గురువారం దుబ్బాక ఐఓసీ కార్యాలయంలో ఏఈఆర్‌ఓలు, ఎంపీడీఓలతో, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ప్రతీ పోలింగ్‌స్టేషన్‌లో ఇద్దరు వలంటీర్లు, వీల్ చైర్లు తప్పక ఏర్పాటు చేయాలన్నారు. ప్రతీ ఇంటికి ఓటర్ స్లిప్‌లు పంపిణీ చేసే బాధ్యత బీఎల్‌ఓలదే అన్నారు. ఓటర్ స్లిప్ పంపిణీలో జాప్యం జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీపీఓ దేవకీదేవి, వివిధ మండలాల ఏఈఆర్‌ఓలు, ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సరుకులు పక్కదారి

- మండల సమావేశంలో సభ్యుల ఆగ్రహం

అక్కన్నపేట(హుస్నాబాద్): అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పంపిణీ చేసే సరుకులు పక్కదారి పడుతున్నాయని కేశవాపూర్ సర్పంచ్ రాజేశం, కేశనాయక్‌తండా సర్పంచ్ రవీందర్, గొల్లకుంట సర్పంచ్ యాదగిరి అధికారులను నిలదీశారు. మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మాలోతు లక్ష్మి అధ్యక్షతన గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రేగొండ, మల్లంపల్లి గ్రామాల్లో ఇటీవల మంజూరైన విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులకు టెండర్లు సైతం పూర్తి య్యాయని, ఎన్నికల కోడ్ ఉండడంతో పనులు జరగడంలేదని విద్యుత్ శాఖ ఏఈ సభలో చెప్పారు. గ్రామాల్లో అధికారులు వచ్చినప్పుడు సర్పంచ్‌లకు సమాచారం ఇవ్వడం లేదని సభ దృష్టికి పలువురు సర్పంచ్‌లు తీసుకొచ్చారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. అధికారులు ఏ గ్రామానికి వెళ్లిన ఆ గ్రామ సర్పంచ్, ఎంపీటీసీలకు తప్పకుండా సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు భూక్య మంగ, ఎంపీడీఓ కొప్పుల సత్యపాల్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ మాలోతు లక్ష్మి

కాంగ్రెస్, బీజేపీల మాటలు నమ్మొద్దు

సిద్దిపేటరూరల్/ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కాంగ్రెస్, బీజేపీ నాయకులు చెప్పే మాయమాటలు ప్రజలు నమ్మొద్దని సుడా చైర్మన్ రవీందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని రాంపూర్, తోర్నాలలో మంత్రి హరీశ్‌రావుకు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలతో గడపగడపకు లబ్ధి జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీదేవి చందర్‌రావు, జెడ్పీటీసీ శ్రీహరిగౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు యాదయ్య, సర్పంచ్‌లు భిక్షపతి, దేవయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే సిద్దిపేట మున్సిపాలిటీ మూడో వార్డు రంగధాంపల్లిలో రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు వంగ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వంగ రేణుక తిరుపతిరెడ్డి, మాజీ కౌన్సిలర్ ఐలయ్య యాదవ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ దుర్గారెడ్డి, వార్డు అధ్యక్షుడు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుడా చైర్మన్ రవీందర్‌రెడ్డి

బీజేపీకి 'గడీల' రాజీనామా

పటాన్‌చెరు టౌన్: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల వేళ బీజేపీకి షాక్ తగిలింది. పార్టీ నిర్ణయాలతో అసంతృప్తితో ఉన్న బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి, పటాన్‌చెరు మాజీ జెడ్పీటీసీ గడీల శ్రీకాంత్ గౌడ్ గురువారం పార్టీకి గుడ్ బై చెప్పారు. తన రాజీనామా లేఖను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డికి పంపారు. 2019లో బీజేపీలో చేరి పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేసినా తనకు సరైన గుర్తింపు లభించలేదన్నారు. తాను అన్ని విధాల నష్టపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. పటాన్‌చెరు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంపికలో పార్టీ ఎవరి అభిప్రాయాలు సేకరించకుండా అభ్యర్థిని ప్రకటించిందన్నారు. కార్యకర్తల మనోభావాలను గౌరవిస్తూ రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

'గౌరవెల్లి' ఘనత సతీష్‌కుమార్‌దే..

అక్కన్నపేట(హుస్నాబాద్): మెట్టప్రాంత రైతుల చిరకాల కోరికైన గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేయించింది ఎమ్మెల్యే సతీష్‌కుమార్ అని ఎంపీపీ మాలోతు లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు భూక్య మంగ, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పెసరు సాంబరాజు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో వారు మాట్లాడారు. ప్రారంభానికి అన్నీ సిద్ధం చేసుకున్న క్రమంలో ఎన్జీటీలో కేసులు వేయించి ప్రాజెక్టు ప్రారంభం కాకుండా కాంగ్రెస్ నాయకులు అడ్డుకున్నారని మండిపడ్డారు. భూ నిర్వాసితులకు న్యాయపరమైన పరిహారం చెల్లించామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు మాలోతు భీలునాయక్, ఎంపీటీసీ సభ్యులు లింగాల శ్రీనివాస్, వేముల శ్రీనివాస్, బైరి రవీందర్, ప్రమీల, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు

సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన

చేర్యాల(సిద్దిపేట)/మద్దూరు(హుస్నాబాద్): ఈనెల 18న పట్టణ కేంద్రంలో నిర్వహించే సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లను గురువారం చేర్యాల ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్ స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట రైతు బంధు సమితి జిల్లా సభ్యుడు అంకుగారి శ్రీధర్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ మంగోలు చంటి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు ఎల్లారెడ్డి, రాష్ట్ర నాయకులు ముస్త్యాల బాల్‌నర్సయ్య, పబ్బోజు విజేందర్, పట్టణ అధ్యక్షుడు ముస్త్యాల నాగేశ్వర్‌రావు, తదితరులు ఉన్నారు. అలాగే మద్దూరు మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మేక సంతోష్‌కుమార్ మాట్లాడుతూ.. బహిరంగ సభకు నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వైస్ ఎంపీపీ మల్లిపెద్ది సుమలత మల్లేశం, రాష్ట్ర నాయకుడు ఆరీఫ్, మండల ఉపాధ్యక్షుడు మంద సుమన్, తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీపీ కరుణాకర్, నాయకులు

రాజశ్యామల యాగానికి ఏర్పాట్లు

నారాయణఖేడ్: పట్టణంలో 18వ తేదీ నుంచి నిర్వహించనున్న రాజశ్యామల యాగం నిర్వహణకు లలిత వైభవం ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. పట్టణానికి చెందిన ప్రముఖ పురోహితుడు మలమంచి మోహన్‌జోషి పర్యవేక్షణలో రాజశ్యామల యాగం, మహారుద్ర సహిత శతచండీయాగపురస్సర చతుర్వేద స్వాహాకార సుదర్శన మహాయాగం నిర్వహించనున్నారు. దీంతోపాటు కార్తీక దీపోత్సవం, అయ్యప్పస్వామి పడిపూజ, వెంకటేశ్వర కల్యాణం, శివ పార్వతుల కల్యాణం నిర్వహించనున్నారు. ఇందుకు పట్టణ శివారులోని దుర్గాభవానీ ఆలయ సమీపంలో ఏర్పాట్లు చేసినట్లు మోహన్ జోషి తెలిపారు. పీఠాధిపతులు, వేద పండితులు, ఆధ్యాత్మిక వేత్తలు పాల్గొని ప్రవచనాలు అందించనున్నారు.

ఓటుహక్కుపై అవగాహన


జోగిపేట (అందోల్): ప్రతీ ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ ప్రియాంక, మున్సిపల్ కమిషనర్ తిరుపతి సూచించారు. గురువారం ఓటరు అవగాహన కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ కార్యాలయంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటుహక్కు రాజ్యాంగం కల్పించిన హక్కు అని ఎలాంటి ప్రలోభాలు, ఒత్తిడికి గురి కాకుండా స్వేచ్ఛగా పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటుహక్కు వినియోగించు కోవాలన్నారు. ముగ్గుల పోటీల్లో మొదటి బహుమతి ఆఫీస్ స్టాఫ్ సాయి ప్రణవి, రెండో బహుమతి అంగన్ వాడీ టీచర్ హిమబిందు, మూడో బహుమతి మహిళా సమాఖ్య ఆర్పీ లక్ష్మీ గెలుచుకున్నారు. కార్యక్రమంలో ఎంఈఓ కృష్ణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నారాయణ, మహిళ సమాఖ్య ఆర్పీలు, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ వైకుంఠధామంలో సామగ్రి చోరీ

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని ధర్మారం వైకుంఠధామంలో రూ. 30 వేలు విలువ చేసే సామగ్రిని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు ఎస్‌ఐ షేక్ యూనుస్ అహ్మద్ అలీ తెలిపారు. రూ. 30 వేలు విలువ చేసే సోలార్ బ్యాటరీలతో పాటు ఇతర సామగ్రిని స్టోరూంలో ఉంచారు. గురువారం ఉదయం సర్పంచ్ రవీందర్‌రెడ్డి వెళ్లి చూడగా తలుపులు పగులగొట్టి కనిపించాయి. ఆయన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

◆ బొట్టు పెట్టి.. సభకు ఆహ్వానించి



చేర్యాల(సిద్దిపేట): ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 18న పట్టణంలో నిర్వహిస్తున్న సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరుతూ గురువారం మండలంలోని ఆకునూరులో ఉల్లెంగుల పద్మ ఏకానందం ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి బొట్టు పెట్టి ఆహ్వానించారు.

◆ పోరాడే వారిని గెలిపించండి

మద్దూరు(హుస్నాబాద్): నిత్యం ప్రజల సమస్యలపై పోరాడే సీపీఎం అభ్యర్థులను అసెంబ్లీకి పంపించాలని ఆపార్టీ జనగామ అభ్యర్థి మోకు కనకారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు నర్సయపల్లి, గాగిళ్లాపూర్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీలో కమ్యూనిస్టులు లేకపోవడంతో పదేళ్లుగా ప్రజా సమస్యలపై ఎలాంటి చర్చ జరగలేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, మండల కార్యదర్శి ఆలేటి యాదగిరి, సుంచు విజేందర్, తదితరులు పాల్గొన్నారు.

◆'హిందువులకు క్షమాపణ చెప్పాలి'

సిద్దిపేటకమాన్: ఇటీవల ఓ ఛానల్ ఇంటర్వ్యూలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు హిందూ ధర్మ రక్షణ సేవా సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ తెలిపారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ.. హిందూ దేవాలయాల భూములను వేలం వేయడానికి మీరెవరని ప్రశ్నించారు.

◆ ప్రతిపక్షాలను నమ్మి మోసపోవద్దు



కొండపాక(గజ్వేల్): ప్రతిపక్షాలను నమ్మి పరేషాన్ కావొద్దని జాగృతి రాష్ట్ర కార్యదర్శి అనంతుల ప్రశాంత్ పేర్కొన్నారు. మండలంలోని మర్పడ్గలో మండల పార్టీ అధ్యక్షుడు నూనె కుమార్, రైతు బంధు సమితి మండల కోఆర్డినేటర్ దుర్గయ్య ఆధ్వర్యంలో గురువారం ఇంటింటి ప్రచారం చేశారు.

◆ జోరుగా బీజేపీ ప్రచారం


తొగుట(దుబ్బాక): బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావుకు మద్దతుగా మండలంలోని చందాపూర్‌లో గురువారం సర్పంచ్ నర్సింలు యాదవ్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సమస్యలపై ప్రభుత్వాన్ని శాసనసభలో నిలదీసి నిధులు మంజూరు చేయించిన ఘనత రఘునందన్‌రావుకే దక్కిందని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు నవీన్, శ్రీకాంత్, చైతన్య పాల్గొన్నారు.



◆ కాంగ్రెస్ నాయకుల ప్రచారం

కొండపాక(గజ్వేల్): కొండపాక, కుకునూరుపల్లి మండలాల్లో కాంగ్రెస్ అభ్యర్థి తూంకుంట నర్సారెడ్డి గెలుపు కోసం ఆయా మండలాల అధ్యక్షులు వాసరి లింగారావు, విరుపాక శ్రీనివాస్‌రెడ్డి గురువారం ప్రచారం నిర్వహించారు. సిర్సనగండ్ల, లకుడారం, రాయవరం గ్రామాల్లో ఇంటింటా తిరుగుతూ ఆరు గ్యారంటీలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ నర్సింహాచారి, నాయకులు గణపతిరెడ్డి, ఆరీఫ్, లీలారెడ్డి, సుధాకర్, వీరేశం, రవిందర్ తదితరులు పాల్గొన్నారు.

◆ మెరుగైన సేవలు అందించాలి



సిద్దిపేటకమాన్: ప్రయాణికులకు మెరుగైన సేవలందించాలని ఆర్టీసీ సిద్దిపేట డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి అన్నారు. సిద్దిపేట, దుబ్బాక డిపోలో ఉత్తమ సేవలు అందించిన 46 మంది సిబ్బందికి గురువారం ప్రగతి చక్రం అవార్డు కార్యక్రమంలో భాగంగా ప్రశంసపత్రాలను ప్రదానం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ సర్వీస్‌లో ఎలాంటి రోడ్డు ప్రమాదం జరగకుండా విధులు నిర్వర్తించిన సిద్దిపేట డిపోనకు చెందిన డ్రైవర్ బీఎస్ రెడ్డి, దుబ్బాక డిపోనకు చెందిన డ్రైవర్ మల్లయ్యను సన్మానించారు.

◆ ఆటో, బైక్ ఢీ: ఒకరి మృతి

దుబ్బాకరూరల్: ఆటో, బైక్ ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన అక్బర్‌పేట- భూంపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోతారెడ్డిపేట గ్రామ శివారులో గురువారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ భువనేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తాళ్లపల్లి గ్రామానికి చెందిన నీల శ్రీనివాస్ (38) భూంపల్లిలో వ్యవసాయ పనులు ముగించుకుని తన స్వగ్రామానికి బైక్‌పై తిరిగి వెళ్తుండగా మెదక్ జిల్లా రామాయంపేట నుంచి భూంపల్లి వైపు వస్తున్న ఆటో బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని దుబ్బాక ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.